క్లుప్తంగా

నూరుశాతం హాజరు ఉండాలి



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సూర్యనారాయణ

పాలకొల్లు సెంట్రల్: అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పోడూరు ఎంఈఓ-2 జీవీ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం పోడూరు మండలం చింతలగరువు ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు నూరుశాతం హాజరయ్యేలా చూడాలని, మెనూ ప్రకారమే రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్యకుమార్, ఉపాధ్యాయులు మట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి వితరణ



బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న వై.అనిల్‌కు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించామని క్లబ్ అధ్యక్షులు కానూరి ప్రభాకరరావు తెలిపారు. అలాగే వివిధ పదవులు పొందిన క్లబ్ సభ్యులు పినిశెట్టి శ్రీనివాస్, కొండ్రెడ్డి సూరిబాబు, పశ్యావుల రవిలను సన్మానించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, సెక్రటరీ గుండు మోగుల వీరాస్వామి, పోకల రాము, జక్కంపూడి కుమార్, రావూరి అప్పారావు, వేరుకొండ దుర్గాప్రసాద్, గంధం ఏసుపాదం, ఇనకొండ శేషాద్రి, శిరిగినీడి నాగార్జున, యర్రంశెట్టి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ విద్యార్థినుల ప్రతిభ



చినిమిల్లి చేతులు మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

పాలకొల్లు సెంట్రల్: గాంధీ జయంతి సందర్భంగా నరసాపురం వైఎన్ కళాశాలలో గాంధియన్ స్టడీ సెంటర్ నిర్వహించిన మేక్ ఇన్ ఇండియా వ్యాసరచన పోటీల్లో దాసరి నారాయణరావు (డీఎన్నార్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఆ వివరాలను డీఎన్నార్ ప్రిన్సిపాల్ శోభారాణి మంగళవారం తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 135 మంది విద్యార్థులు పాల్గొనగా తమ కళాశాల బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థినులు రమ్యశ్రీ, సింధులు రెండు, మూడో స్థానాల్లో నిలిచారని, వైఎన్ కళాశాల కరస్పాండెంట్ చినిమిల్లి సత్యనారాయణ చేతులు మీదుగా బహుమతులు అందుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థినులను ఆమె అభినందించారు. అధ్యాపకులు నోబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి జీవితం ఆదర్శనీయం



వాల్మీకి జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: రామాయణం రచించిన వాల్మీకి జయంతిని మంగళవారం నరసాపురం మండలం కొప్పర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఉప్పుగంటి రాజశ్రీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చెడు అలవాట్ల నుంచి మంచిగా మారేందుకు వాల్మీకి ఆదర్శమని రాజశ్రీ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

11, 12 తేదీల్లో చాంబర్స్ స్వర్ణోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న చాంబర్స్ కళాశాల సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు తెలిపారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సొసైటీ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలు రెండు రోజులపాటు నిర్వహించనున్నామని తెలిపారు.

అయ్యప్ప ఆలయం.. ఎంతో ప్రత్యేకం

- పాలకొల్లులో ఏకశిలతో పదునెట్టాంబడి
- 34 ఏళ్లుగా కేరళ సంప్రదాయంలో పూజలు
- 12 ఏళ్లుగా ఉచిత అన్నదానం



అయ్యప్పస్వామి



అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు, నరసాపురం రహదారిలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్పస్వామి ఆలయం పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో అతిపెద్ద ఆలయంగా చెప్పవచ్చు. ఈ ఆలయాన్ని దాదాపుగా 34 సంవత్సరాలు క్రితం నిర్మించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఏకశిలతో తయారు చేసిన పదునెట్టాంబడి ఈ ఆలయానికి ప్రత్యేకత. అప్పట్లో ఇలా ఏకశిలతో తయారుచేసిన పదునెట్టాంబడి తూర్పుగోదావరి జిల్లా ద్వారపూడి తరువాత పాలకొల్లులోనే ఉంది. ఈ ఆలయంలో గత 12 సంవత్సరాలుగా దాతల సహకారంతో ఉచిత భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయ్యప్ప, శివ, భవానీ మాలధారులు రోజుకు ప్రారంభంలో 300 నుంచి 500 వరకు, నవంబర్, డిసెంబర్ నెలలు వచ్చేసరికి స్వాముల సంఖ్య దాదాపు 500 నుంచి 800 వరకు ఇక్కడ భిక్ష చేస్తుంటారు. దాదాపు 80 రోజుల పాటు రోజుకో దాత వితరణతో అన్నదానం చేస్తున్నారు. డిసెంబర్ నెలలో స్వాములు సంఖ్య తగ్గుతుండడంతో ఈ సంవత్సరం 62 రోజులు మాత్రమే అన్నదానం చేయనున్నారు.

ప్రత్యేక పూజలు

ఈ ఆలయంలో విఘ్నేశ్వరుడు, నాగరాజు, వేంకటేశ్వరస్వామి, మాలికాపురోత్తమ తల్లి, నవగ్రహాలు ఇలా ఉపాలయాలతోపాటు ధ్యానమందిరం కూడా ఉంది. ఈ ధ్యాన మందిరంలో ప్రతి పౌర్ణమి, అమావాస్యలకు సుమారు 100 మంది భక్తులు ధ్యానం చేస్తుంటారు. ఈ ఆలయంలో నిత్య పూజాధికాలు, అభిషేకాలతోపాటు నవంబర్ 16 నుంచి డిసెంబర్ 26 వరకు మండల కాలం కలశ పూజలు నిర్వహిస్తారు. ఏటా నవంబర్ 16న పడిపూజ అతివైభవంగా చేస్తారు. ఏప్రియల్ 10 నుంచి 18 వరకు కేరళ సంవత్సరాది ప్రకారం ఇష్యు పండుగ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. జనవరి 14న మకర సంక్రాంతి రోజు న శబరిమలైలో జ్యోతి దర్శన సమయానికి ఇక్కడ జ్యోతి దర్శనం, పదునెట్టాంబడి ఏర్పాటు చేస్తారు.

స్వాములకు ఇదే అతి పెద్దపీఠం

ఆలయానికి కింద భాగంలో పూర్ణకుంభం ముఖ ద్వారంతో ఓ మండపం ఉంది. ఈ మండపంలో ప్రతి సంవత్సరం అయ్యప్ప దీక్షాపరులు స్వామి వారి పీఠం ఏర్పాటు చేస్తుంటారు. ఒకరిద్దరు లేఖ ముగ్గురు కలిసి మాల దరించి పీఠం ఏర్పాటు చేసుకునే వెసులుబాటు లేని మాలధారులకు, పాలకొల్లు చుట్టుపక్కల, పరిసర ప్రాంతాల స్వాములకు, ఇతర ప్రాంతాల నుంచి ఏదైనా పని మీద పాలకొల్లు వచ్చిన స్వాములకు పూజలు చేసుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉండే పీఠాల్లో ఇదే అతి పెద్ద పీఠం. ఇక్కడ ఓ గురుస్వామి ఉంటారు. స్వాములు ఆలయం పక్కనే ఉన్న కాలువలో స్నానమాచరించడానికి, ఆలయం వద్ద పడుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. మండల కాలానికి పూజాసామగ్రి నిమిత్తం స్వాములకు రూ.3 వేలు వరకు చెల్లిస్తారు.

దాతల సహకారంతో అభివృద్ధి



48 ఏళ్లుగా అయ్యప్ప స్వామి దీక్ష చేస్తున్నాను. వరుసగా 18 సంవత్సరాలు 108 రోజులు దీక్ష చేపట్టి 18వ సారి దీక్షలో శబరిమలై కాలినడకన వెళ్లాను. 12 ఏళ్లుగా దాతల సహకారంతో ఇక్కడ స్వాములకు భిక్ష ఏర్పాటుచేస్తున్నాం. భిక్ష నిమిత్తం దాతలు రోజుకు రూ.25 వేలు సహకారం అందిస్తున్నారు. గతేడాది వరకు 80 రోజులు, ఈ ఏడాది 62 రోజులే భిక్ష నిర్వహిస్తున్నాం. భక్తులు సమర్పించిన బంగారం, వెండితో పంచలోహ విగ్రహాన్ని తయారు చేయించాం. దాతల సహకారంతో అన్నదాన భవనం నిర్మించాం. దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేశాం.

– బాబుల్ గురుస్వామి, ఆలయ వ్యవస్థాపకులు, పాలకొల్లు

కేరళ పద్ధతిలో పూజలు



ఈ ఆలయంలో కేరళ సాంప్రదాయ పద్ధతిలోనే పూజాధికాలు నిర్వహిస్తున్నాం. నా స్వగ్రామం కైకలూరు. కేరళలో స్వామివారికి నిర్వహించే పూజా సాంప్రదాయాలన్నీ నేర్చుకున్నాను. ఇక్కడ 22 సంవత్సరాలుగా అర్చకత్వం చేస్తున్నాను. ఉదయం 5 గంటలకే గణపతి హోమం, స్వామివారికి అభిషేకం చేస్తాం. 6.30 గంటలకు ఉష పూజతో స్వామివారి దర్శనం ప్రారంభమవుతుంది. 10.45 గంటలకు మహా నివేదన ఉంటుంది. సాయంత్రం 7.45 గంటలకు హరివరాసనం నిర్వహిస్తాం. ప్రతి బుధవారం స్వామివారికి అలంకార పూజలు చేస్తాం.

– బాలసుబ్రహ్మణ్యం చైనులు, ఆలయ ప్రధానార్చకులు, పాలకొల్లు



ఏకశిల పదునెట్టాంబడి



ఆలయం కింద మండపంలో స్వామివారి పీఠం, పూజల్లో పాల్గొన్న స్వాములు



భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు

ముంపు చేల పరిశీలన



ముంపు వరిచేలను పరిశీలిస్తున్న అధికారులు

పెనుగొండ: అధిక వర్షాలు, గోదావరి వరద, నక్కల డ్రెయిన్ల ఉధృతికి ఆచంట వేమవరంలో ముంపుకు గురైన వరిచేలను వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. గోదావరి ఉధృతితో మురుగు వెనక్కి ప్రవహించి నక్కల డ్రెయిన్ పరివాహక వరిచేలు ముంపుకు గురయ్యాయి. వరి నాట్లు పూర్తిగా కుళ్లిపోతున్నాయి. వరి త్వరగా కోలుకోవడానికి 15 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ తక్షణమే వేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. తెగుళ్ల నివారణకు మ్యాంకోజబ్, కార్బనిజం లీటర్ నీటికి గ్రాము మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయాధికారి బి.నాగరాజు, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



ఆచంట సెంటర్‌లో ధర్నా చేస్తున్న మాల సంఘాల జేఏసీ

పెనుగొండ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై సుప్రీం కోర్టులో జరిగిన దాడి హేయమైన చర్యని ఆచంట నియోజకవర్గ మాల సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు బీరా మధు విమర్శించారు. ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఆచంట సెంటర్‌లో ధర్నా చేశారు. జేఏసీ నాయకుడు ఉన్నమట్ల మునిబాబు మాట్లాడుతూ మతోన్మాది, కుల దురహంకారి అడ్వకేట్ చేసిన హేయమైన చర్యపై భారత ప్రభుత్వం తక్షణమే స్పందించి, దేశ బహిష్కరణ చేసి, యావదాస్తులు జప్తు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బహుజన నేత చింతపల్లి గురుప్రసాద్, మాల సంఘాల నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, తప్పెట్ల వెంకట్రావు, జెంట్రీ శ్రీను, పిల్లి రుద్ర ప్రసాద్, పులిదిండి వెంకటేశ్వరరావు, కొంబోత్తుల దుర్గా ప్రసాద బొంతు శ్రీను, మట్టా చంటి, పీతల అంబేద్కర్, ఏనుగుపల్లి వరప్రసాద్, కలగత సాగర్, కోటి శశిమధు, పుచ్చకాయల నాగార్జున, వడ్లపాటి అంబేద్కర్‌లు పాల్గొన్నారు.

తీర్మానానికి వ్యతిరేకంగా నిర్ణయాలు



గత తీర్మానాలను చూపుతున్న సర్పంచ్ లక్ష్మీ చంద్రిక

పెనుగొండ: పండిత విల్లూరు పంచాయతీ పాలకవర్గం చేసిన తీర్మానాలకు విలువ లేకుండా, కూటమి నాయకులతో కలిసి అధికారులు వ్యవహరిస్తున్నారని సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక ఆరోపించారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పంచాయతీ కాంట్రాక్టు సిబ్బంది, టెండర్ల అమలు విషయంలో జనవరి, ఏప్రిల్, జూన్ నెల్లో పంచాయతీ పాలకవర్గం పలు తీర్మానాలు చేసిందని తెలిపారు. అయితే, కొందరు కూటమి నాయకుల ప్రమేయంతో తీర్మానానికి విరుద్ధంగా స్థానిక అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాలకవర్గ సమావేశంలో సర్పంచ్ వద్ద ఉండాల్సిన మినిట్స్ బుక్‌ను ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌కు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని, దీనికి అధికారులు సహకరించడం దారుణమని అన్నారు. అత్యవసర సమావేశం వివరాలు అందించడంలోనూ గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. వార్డు సభ్యులకు తెలిపిన తర్వాతే సర్పంచ్‌కు సమాచారం ఇచ్చారని చెప్పారు. దీనిలో గత సమావేశ తీర్మానాలు అమోదించాలని డీసెంట్ రాసి ఇచ్చాని తెలిపారు. 15 ఏళ్లుగా పంచాయతీ కార్మికుడుగా పనిచేస్తున్న వేంద్ర వెంకటేశ్వరరావును తొలగించాలని కొందరు గ్రామ పెద్దలు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పాలకవర్గం తీర్మానం చేసిందన్నారు. కొత్త పోస్టులకు పాలకవర్గం వ్యతిరేకం కాదని, అయితే కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పెనుగొండ: ధాన్యం అమ్మకాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం ఆచంటలో సార్వా ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించారు. కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2,389, సాధారణరకానికి రూ.2,369 గా నిర్ణయించామన్నారు. పంట నమోదు చేయించుకొన్న రైతులు నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. గోనే సంచులు అందుబాటులో ఉన్నాయని, వాట్సాప్ షెడ్యూల్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కదలి భాస్కరరావు, సిద్ధాంతం వాటర్ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు తమ్మినీడి ప్రసాద్, ఎంపీటీసీ బొక్కా సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి బి.నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా శిక్షణ



శిక్షణకు తక్కువగా హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులు

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వ విన్యాసాలు అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను కూడా ఆశ్చర్యానికి, కొంత విస్మయానికి గురి చేస్తున్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నరసాపురం మొగల్తూరు మండలాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మరికొద్ది నెలల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుంది. కొందరు పంచాయతీ కార్యదర్శులు పదవీ విరమణకు దగ్గరలో ఉన్నారు. ఈ నేపథ్యంలో వారికి శిక్షణ ఇవ్వడం ఎవరి మేలుకోసం అంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంపీటీసీ సభ్యులు తమకు గౌరవ వేతనం విడుదల చేయాలని పదేపదే కోరుతున్నప్పటికీ ఆ విషయాన్ని పట్టించుకోకుండా పంచాయతీరాజ్ శాఖ అధికారులు శిక్షణ పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. శిక్షణకు రెండు మండలాల నుంచి ఆశించిన స్థాయితో సర్పంచ్‌లు హాజరుకాకపోవడంతో కార్యక్రమం వెలవెలబోయింది. హాజరైన సర్పంచ్‌లు తమకు ఈ శిక్ష ఏమిటంటూ వాపోతున్నారు. పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయకుండా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కొందరు అధికారుల జేబులు నింపడానికే ఉపయోగపడతాయని ఆరోపిస్తున్నారు. నూతనంగా ఎన్నికయ్యే సర్పంచ్‌లకు మొదటి నుంచి పరిపాలనపై అవగాహనకు దోహదపడేలా శిక్షణ కార్యక్రమాలు చేపడితే బాగుంటుందని, త్వరలో మాజీలు కాబోయే తమకు ఎందుకుని సర్పంచ్‌లు అంటున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అత్తిలి: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా మంగళవారం అత్తిలి మండలం గుమ్మంపాడు-2 కేంద్రంలో మూడేళ్లలోపు పిల్లల తల్లులతో అవగాహన సమావేశం నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ బాలింతలు తమ చేతులను శుభ్రం చేసుకుని ఫీడింగ్ ఇవ్వాలని, మొబైల్‌ఫోన్ చూపిస్తూ పిల్లలకు ఆహారం తినిపించరాదని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో తమ చిన్నారులకు ఎత్తులు, బరువులను చూపించుకోవాలన్నారు. తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వడం, ఆహార పదార్థాలను వైవిధ్యంగా ఎలా తయారు చేయాలో వండి చూపించారు. పిల్లలకు పోషకాహారంతో పాటు మునగాకు, మెంతికూర రోజు వారి ఆహారంగా ఇవ్వాలని కోరారు. జంక్‌ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్, నూనె అధికంగా గల ఆహార పదార్థాలను తినడం వల్లే ఊబకాయం వస్తుందన్నారు. రోజు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని, నూనె శాతాన్ని, పంచదార వాడకాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి.రాజకుమారి, సహాయకురాలు పి.చిట్టిమరియ, తల్లులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే సంపద



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌కుమార్

తణుకు అర్బన్: ప్రతి వ్యక్తికి మానసిక ఆరోగ్యం, మానసిక బలం సంపదగా ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొందని మానసిక వైద్య నిపుణుడు బి.రమేష్ కుమార్ అన్నారు. ప్రపంచ మానసిక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇండియన్ సైక్రియాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక గజిబిజి జీవనంలో సరైన ప్రణాళిక లేకపోవడంతో అధికశాతం ఒత్తిడికిలోనై డిప్రెషన్‌లోకి వెళ్లి అనారోగ్యాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సరైన ప్రణాళికలతో ఎప్పుడు చేయాల్సిన పనిని అప్పుడే చేసేలా ఉండాలని, చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. మంచి విషయాలను ఆస్వాదిస్తూ చెడు విషయాలను వదిలివేసే తత్వాన్ని అలవరచుకుంటే మానసికంగా ఫిట్‌గా ఉంటారని అన్నారు. ముఖ్యంగా చిన్నతనం నుంచే మంచి పోషకాహారం తీసుకుంటూ, వ్యాయామం చేయాలని అన్నారు.

పశువైద్యశాలకు మోక్షం ఎప్పుడో?



మధ్యలోనే నిలిచిన పెనుగొండ పశు వైద్య శాల



పశువుల మందులకు పాత బీరువాలే రక్షణ



అసంపూర్తి నిర్మాణంలోనే పశువైద్య సేవలు

పెనుగొండ: ఏళ్లు గడుస్తున్నా పెనుగొండ పశు సంవర్థక శాఖ పశు వైద్యశాలకు మోక్షం కలగడం లేదు. నిత్యం పదుల సంఖ్యలో వచ్చే పాడి పశువులకు వైద్య సేవలు అందించే ఈ పశువైద్య శాల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పెనుగొండలో ఏడేళ్ల క్రితం రూ.85 లక్షలతో పశువైద్య శాల నిర్మాణం చేపట్టారు. సహాయ సంచాలకుల వారి కార్యాలయం కావడంతో భారీ నిర్మాణం చేపట్టారు. క్రింది అంతస్తులో దాణా, పశువులకు అవసరమైన అత్యవసర మందులు అందుబాటులో ఉంచేందుకు, మొదటి అంతస్తులో సహాయ సంచాలకుల కార్యాలయం, గ్రామీణ పశువైద్యులతోనూ, రైతులతోనూ సమీక్షా సమావేశాలు నిర్వహించడానికి అనువుగా నిర్మాణం చేపట్టారు. శ్లాబులు వేయడం, గదులు నిర్మించడంతో పాటు సిమెంట్ వర్కులు పూర్తి చేశారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో నిర్మాణం నిలిపేశారు. ఇంకా మరుగుదొడ్లు, కిటికీలు, గదులకు తలుపులు, విద్యుద్దీకరణ, అల్మరాలు, ఇతర పనులు పూర్తి చేయాల్సుంది. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో పశువైద్య సిబ్బంది వేచి చూసిచూసి ఇప్పట్లో నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలు లేకపోవడంతో రక్షణలేని నిర్మాణం మధ్యలోనే వైద్య సేవలు ప్రారంభించారు. పశు వైద్య మందులు, ఇతర సరుకులకు పాత బీరువాల్లోనే భద్ర పరచుకొంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పశువులదాణా వచ్చినా తలుపులు లేని గదుల్లోనే వేసే, వెంటనే పాడి రైతులకు అందిస్తున్నారు. పాడిపెయ్యి ఉత్పత్తి చేయడానికి అందించే స్పెరంలు, ఇతర విలువైన మందులు బయట ఉన్న ఫ్రిజ్‌లోనే ఉంచుతూ దేవుడిపై భారం వేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య శాల నిర్మాణాన్ని పూర్తి చేయించాలని పాడిరైతులు కోరుతున్నారు.